ఆరోగ్యానికి భరోసా.. జగనన్న సురక్ష

ప్రజారోగ్యమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమ ఆరోగ్యానికి భరోసా కల్పించారని పేదలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. నిరుపేదలమైన తమకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్న ఘనత జగనన్నదే అని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత వైద్యం, ఉచితంగా మందులు అందజేస్తుండడంపై జేజేలు పలుకుతున్నారు.

- వెలంపేటలో 612 మందికి.. వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 606 మందికి.. జ్ఞానాపురం యూపీహెచ్‌సీలో 658 మందికి వైద్యసేవలు
- ఉచితంగా మందుల అందజేత



వెలంపేట శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న మహిళలు



వెలంపేట శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా కల్పిస్తూ, విద్య, వైద్యం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల చెంతకే వైద్యాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శనివారం జీవీఎంసీ 35వ వార్డు వెలంపేటలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ స్టేడియం సచివాలయానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాధారణ వ్యాధులకు వార్డుల్లోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం అందిస్తున్నామని.. వ్యాధి తీవ్రతను బట్టి కార్పొరేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నట్లు తెలిపారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 612 మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం వైద్యాధికారి డాక్టర్ సందేష్ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షల అనంతరం కార్పొరేట్ ఆస్పత్రులకు తరలిస్తారని తెలిపారు. 140 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, గృహసారథులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో..

అల్లిపురం : పేదల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 32వ వార్డు అధ్యక్షుడు మూలే రామిరెడ్డి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 32వ వార్డు లబ్ధిదారులకు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. జగనన్న తీర్చిదిద్దిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు సంజీవినిలా మారిందన్నారు. మొత్తం 606 మంది హాజరైన ఈ శిబిరంలో పలు విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు ప్రజలకు సేవలందించారు. బీపీ, షుగర్‌తో పాటు పలు రకాల పరీక్షలు నిర్వహించి వ్యాధులను బట్టి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఒకరిని న్యూరాలజీకి మరొకరిని ఆర్థోపెడిక్ విభాగానికి రిఫర్ చేశారు. అదే విధంగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలు పోషకాహారం, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వాటి వల్ల కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగం శ్రీనివాసరావు, కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దొండపర్తి యూపీహెచ్‌సీలో..

సీతమ్మధార : ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 27వ వార్డు దొండపర్తి యూపీహెచ్‌సీలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గడపకు వెళ్లి వైద్యం అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు ప్రెసిడెంట్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, మండల ప్రెసిడెంట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆశ వర్కర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం యూపీహెచ్‌సీలో..

కంచరపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అన్నారు. జ్ఞానాపురం వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సుమారు 658 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీలా తెలిపారు. పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, నాయకులు వేళంగిణీరావు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ పద్మావతి



దొండపర్తి యూపీహెచ్‌సీ శిబిరానికి హాజరైన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



జ్ఞానాపురం యూపీహెచ్‌సీ శిబిరంలో కేస్ షీట్లు, మందులు అందజేస్తున్న పూర్ణిమ

క్లుప్తంగా

బీసీ సంఘ సభ్యులకు ఉచిత ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ



సభ్యులకు బాండ్లు అందజేస్తున్న కొణతాల

దాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సభ్యులకు శనివారం ఉచిత ఇన్సూరెన్స్ బాండ్లను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ అందజేశారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పిల్ల నూకరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కొణతాల మాట్లాడుతూ ఏపీ బీసీ సంక్షేమ సేవా సంఘం కోసం, సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్న సభ్యులకు దోహదపడేలా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థ ద్వారా ఇన్సూరెన్స్ బాండ్లు పలువురు సభ్యులకు అందజేస్తామని, రెండో విడతగా 38వ వార్డులో గల సంఘ సభ్యులకు రెండేళ్ల కాల పరిమితి గల బాండ్లు అందజేశామన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్న వారికి మెడిక్లెయిమ్ త్వరలోనే ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆలేటి హేమలత, సభ్యులు రాంబాబు, కె. కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాల నిర్వహణ



యువతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మోహన్

సీతమ్మధార : అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా శనివారం ద్వారకానగర్, దొండపర్తి రోడ్డులోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారుల సంచార వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువతకు కె.మోహన్ సర్టిఫికెట్లు అందజేశారు.

తోటి వారికి సాయమందిస్తేనే సమాజ ప్రగతి



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న అచ్యుతరావు

దాబాగార్డెన్స్ : సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయమందించాలని అప్పుడే అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. తన కుమారుడు యశ్వంత్ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీవో టీటీ పోటీల విజేత ఏఎస్‌ఎల్

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌డీవో సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన ఏఎస్‌ఎల్ విజేతగా నిలవగా ఆర్‌సీఎల్ రన్నరప్‌గా నిలిచింది. ఇక్కడి సాగరసమరతీర సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో ముగిసిన ఈ టీమ్ చాంపియన్‌షిప్‌లో తొమ్మిది మంది మహిళా క్రీడాకారిణులతో మొత్తంగా 102 మంది తొమ్మిది బృందాలుగా డీఆర్‌డీవో ల్యాబ్ జట్లు పోటీపడ్డాయి. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఎన్ఎస్‌టీఎల్, అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబోరెటరీ(ఎఎస్‌ఎల్), సెంటర్‌ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ సైన్సెస్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లేబొరేటరీ(చెస్), రీసెర్చ్‌సెంటర్ ఇమారత్(ఆర్‌సిఐ), డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీ(డీఆర్‌డీఎల్)తో సహా వివిధ డీఆర్‌డీవో ల్యాబ్‌లకే చెందిన వీరంతా పోటీపడ్డారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



గాజులవీధికి చెందిన సుబ్బరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో వైద్య సాయం కోసం వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పందించారు. సొంత నిధుల నుంచి ఎనిమిది మందికి రూ.45 వేల 500 ఆర్థిక సాయం అందజేశారు. 27వ వార్డు శ్రీనగర్‌కు చెందిన దేవరపల్లి నిఖిల్‌సాయి జెనెటిక్ సమస్యతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా రూ.10 వేలు, 30వ వార్డు జాలారిపేటకు చెందిన వాసుపల్లి సత్యవతి కిడ్నీ సమస్యతో బాధపడి ఇటీవల మృత్యువాత పడిన దృష్ట్యా పెద్ద కర్మ కోసం రూ.5 వేలు, అదే ప్రాంతానికి చెందిన నక్క సత్యం పక్షవాతంతో బాధపడుతున్న దృష్ట్యా మందుల కొనుగోలుకు రూ.5 వేలు, 39వ వార్డు కోటవీధికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ పక్షవాతంతో మంచాన పడడంతో మందుల కొనుగోలుకు రూ.5 వేలు, ఫెర్రీరోడ్డుకు చెందిన వాడమోదుల అప్పల నరసమ్మ పక్షవాతంతో దీర్ఘకాలంగా బాధపడుతూ, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రూ.5,500, 35వ వార్డు వెలంపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాసరి మణి కుటుంబ పోషణకు రూ.5 వేలు, గాజులవీధికి చెందిన పితాని సుబ్బరాజు పక్షవాతంతో మంచాన పడడంతో మందుల కొనుగోలుకు రూ.5 వేలు అందజేశారు. అలాగే 34వ వార్డు భూపేష్‌నగర్‌కు చెందిన తొంపాలా గణేష్ కడుపులో ట్యూమర్ కారణంగా దీర్ఘకాలంగా పలు వ్యాధులతో బాధపడుతున్న దృష్ట్యా మందుల కొనుగోలుకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, విల్లూరి భాస్కరరావు, తోట పద్మావతి, పలు వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రెసిడెంట్లు, ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

'9 నుంచి ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ఈ నెల 9 నుంచి ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలి? అనే వినూత్న కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులతో కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో పార్టీ జెండా ఎగరేసేందుకు పోల్స్ ఏర్పాటు చేయాలని, సచివాలయాల పరిధిలో గల సంఘ పెద్దలతో భేటీ అయి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన గురించి ప్రస్తావిస్తూ వారితో కలిసి భోజనం చేసి బస చేయాలని తెలిపారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడూరు అప్పలరత్నం, విల్లూరి భాస్కరరావు, కోడిగుడ్ల పూర్ణిమ, బిపిన్‌కుమార్ జైన్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, పలు వార్డుల అధ్యక్షులు, మండల ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బాక్సర్లకు ఎమ్మెల్యే వాసుపల్లి సత్కారం



బాక్సర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, రఘురామ్ తదితరులు

అల్లిపురం : బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆలిండియా బాక్సింగ్–2023 పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన రాష్ట్రానికి చెందిన బాక్సింగ్ క్రీడాకారులను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సత్కరించారు. గత నెల 27 నుంచి 29 వరకు న్యూఢిల్లీ హెచ్‌డీ సెహ్రావత్ సెకండరీ స్కూల్, చంచల్ పార్కులో జరిగిన పోటీల్లో అండర్ 12 సబ్ జూనియర్, జూనియర్, యూత్, సీనియర్ మెన్ అండ్ వుమెన్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ 2023లో రాష్ట్ర క్రీడాకారులు 13 బంగారు, 12 వెండి, 5 కాంస్య పతకాలు సాధించారు. యలమంచిలికి చెందిన కె.జస్వంత్ బెస్ట్ బాక్సింగ్ ప్రమోటర్‌గా నిలిచాడు. వీరిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సత్కరించి అభినందించారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎల్లపు రఘురామ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసుపల్లి అమ్మోరు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ బజ్జింకి, కోచ్‌లు కె. శ్రీను, బి. శ్రీనివాస్, కె.సత్యనారాయణ, కె. కనకరాజు, స్టార్ వన్ రిఫరీ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 10న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ బట్టు వీరబ్రహ్మం మృతిపై ఈ నెల 10న మెజిస్టీరియల్ విచారణ చేపడుతున్నట్లు విశాఖ ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి నగలమ్మ వీధికి చెందిన బట్టు వీరబ్రహ్మం(78)ను చికిత్స నిమిత్తం 2023 మే 15న కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. అదే రోజు చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించి.. విశాఖ ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని తన కార్యాలయంలో ఆ రోజు 11 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని, వీరబ్రహ్మం మరణం గురించి తెలిసిన వారు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆర్డీవో సూచించారు.

గాయత్రీ మంత్ర జప యజ్ఞంతో సనాతన ధర్మ వ్యాప్తి



మంత్ర జప యజ్ఞం నిర్వహిస్తున్న సంధ్యోపాసకులు

దాబాగార్డెన్స్ : లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ కల్వకొలను చిత్తరంజన్‌దాస్ స్మారక సేవా సంస్థ ఆధ్వర్యంలో శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞం నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. దీనిలో భాగంగానే శనివారం మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణ వేదికగా సామూహిక గాయత్రీ మంత్ర హవనం, పూర్ణాహుతి నిర్వహించినట్టు చెప్పారు. శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞంలో 3 వేల మంది నిత్యం సంధ్యోపాసకులు జపం చేస్తున్నారని, దేవీ భాగవత అనుసారంగా జరుగుతున్న శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞానికి పంచాహ్నిక దీక్ష, సహస్రాధిక రుత్వికులు చతుర్వింశాత్మక కుండ హవనం, మండపారాధనలు, దీక్షాధారణలు, సీతారామకల్యాణ మహోత్సవం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం, సాధూ సమ్మేళనం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు గత నెల 27 నుంచి 31 వరకు ఉత్తరప్రదేశ్ అయోధ్యపురిలో వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. చిత్తరంజన్‌దాస్ స్మారక సేవా సంస్థ నేతృత్వంలో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సనాతన ధర్మ వ్యాప్తికి విశేష కృషి చేస్తూ అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ సోమరాజు రఘునాథ్, ప్రిన్సిపల్ కో ఆర్డినేటర్లు మిర్తిపాటి వెంకటరామయ్య, ఖండవల్లి సీతారాం, రామకృష్ణ, కేసీడీటీ సభ్యులు పాల్గొన్నారు.

'టీడీపీ కోవర్ట్ పురందేశ్వరి'



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

దాబాగార్డెన్స్ : మాజీ ఎంపీ పురందేశ్వరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలైన తర్వాత, టీడీపీ కోవర్ట్‌గా ఉంటూ బీజేపీని భ్రష్టు పట్టిస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు ఆరోపించారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీలో ఉన్న నాయకుల ఓట్లను టీడీపీకి మళ్లిస్తూ నానాటికీ బీజేపీని దిగజార్చుతున్నారని, బీజేపీ అధిష్టానం వెంటనే జోక్యం చేసుకోకపోతే ఏపీలో బీజేపీకి పుట్టగతులుండవన్నారు. ఎన్టీఆర్‌ను చంద్రబాబు మోసం చేసి, అధికారంలోకి వచ్చినప్పుడు తండ్రి పక్కన పురందేశ్వరి లేరన్నారు. బీజేపీలో చాలా మంది కోవర్టులున్నారన్నారు. పురందేశ్వరి ఏం మాట్లాడినా టీడీపీ కార్యాలయం నుంచే స్క్రిప్ట్ వస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు 3 సెంట్ల భూమి కేటాయించడంపై స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో స్వరూపారాణి, అరుణ్‌దాస్, రాంబాబు, సునీల్‌బాబు, సందీప్ పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్ల సన్నిధి సేవ చేసి, సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, శ్రీహరి కోలాట బృందం వారి కోలాటం ఆకట్టుకున్నాయి.

పక్కా ప్రణాళికతో వాకర్స్ క్లబ్ సేవలు



మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి

మురళీనగర్: పక్కా ప్రణాళికతో వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం నిర్వహించిన క్లబ్ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్కు సుందరీకరణ, క్లబ్ ఆర్థికాభివృద్ధి, సేవా, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను సభ్యులకు వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్ మాట్లాడుతూ డిసెంబరు 23, 24 తేదీల్లో విశాఖలో జరగనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ వార్షిక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యదర్శి ఎల్వీ సుధాకర్, కోశాధికారి జె.కూర్మారావు క్లబ్ వార్షిక నివేదికలు తెలిపారు. ప్రపంచ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. వాకర్స్ వాయిస్ నెలవారి పత్రికను పూర్వ అధ్యక్షుడు ఎం.భాస్కరరావు ఆవిష్కరించారు.

నూతన కార్యవర్గం..

వాకర్స్ క్లబ్ 2024 సంవత్సరానికి ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి ఎస్.బుచ్చయ్య ఈ సమావేశంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా పల్లా చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల రామకృష్ణ, కార్యదర్శిగా ఎల్వీ సుధాకర్, కోశాధికారిగా జె.కూర్మారావు, జాలీ వాకర్‌గా ఎస్.ప్రకాశరావు, బోర్డు డైరెక్టర్లుగా టి.వెంకటరమణ, పి.చెల్వరాజు, వడ్డాది అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు, జి.విజయలక్ష్మి ఎన్నికయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. తమను వరుసగా రెండో సారి ఎన్నుకున్నందుకు కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.2.43 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శ్రీ హరి సేవా సంఘం సభ్యులు

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి రూ.2,43,062 హుండీ ఆదాయం లభించిందని ఆలయ ఈవో రమాభాయ్, ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఈ మొత్తం మూడు నెలలకు గాను లభించిందన్నారు. శనివారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో రమాభాయ్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో హుండీలు తెరిచారు. శ్రీహరి సేవా సంఘం సభ్యులు పాల్గొని లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇదిగో.. ఏయూ ప్రగతి



ఏయూ గ్రంథాలయం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత ఐదు సంవత్సరాల్లో సాధించిన ప్రగతిని నాక్ కమిటీ ముందు ఆవిష్కరిస్తున్నారు. తొలి రోజు కమిటీ పర్యటన ఎంతో సంతృప్తికరంగా సాగింది. ఆదివారం ఉదయం కమిటీ సభ్యులు మరిన్ని విభాగాలు, పరిశోధన కేంద్రాలను సందర్శించే అవకాశం ఉంది. దీనికి అనుగుణంగా అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ప్రతీ విభాగంలో జరుగుతున్న కార్యక్రమాలు, ప్రగతిని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

తలమానికంగా గ్రంథాలయం

నాక్ కమిటీ సందర్శించే ప్రధాన విభాగాల్లో ఒకటి గ్రంథాలయం. దీన్ని అవసరమైన విధంగా ఇప్పటికే సిద్ధం చేశారు. పూర్తిస్థాయిలో గ్రంథాలయంలో వసతులు కల్పించి ఆధునీకీకరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే రీడింగ్ రూమ్, ఇ – లెర్నింగ్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నాయి. గ్రంథాలయంలో దశాబ్దాలుగా భద్రపరిచిన తాళపత్ర గ్రంథాలు, ఆన్‌లైన్ వెబ్‌బేస్డ్ డిజిటల్ సర్వీస్ సెంటర్, అరుదైన గ్రంథాల పుస్తక ప్రదర్శన నాక్ కమిటీ సభ్యులకు వివరిస్తారు. అదేవిధంగా ఏయూ పరిశోధన గ్రంథాల డిజిటలైజేషన్, డిజిటల్ సేవలు అందిస్తున్న సేవలు కమిటీ సభ్యులకు వివరిస్తారు.

మరిన్ని విభాగాల సందర్శన

ఆదివారం నాక్ కమిటీ మరిన్ని విభాగాలను సందర్శిస్తుంది. ఈ నేపథ్యంలో వర్సిటీ పూర్తిస్థాయిలో పనిచేస్తుంది. అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తాయి. క్రీడా విభాగం, ఏయూ – లూక్స్ స్టూడియో, యోగా విభాగంతోపాటు వర్సిటీలో విద్యార్థులకు ఉపయుక్తంగా అందిస్తున్న పలు సేవలు తదితర అంశాలను కమిటీ సభ్యులు పరిశీలిస్తారు. ఏయూలో పలు పరిశోధన కేంద్రాలను సైతం కమిటీ సభ్యులు సందర్శిస్తారు.